కాంగ్రెస్ పాలన గాడి తప్పింది

అభివృద్ధికి ఒక్క పైసా ఇవ్వడం లేదు

'పాలమూరు-రంగారెడ్డి'పై కేంద్రాన్ని నిలదీయలేని అసమర్థత రేవంత్‌ది

కేసీఆర్ ఒక విజన్‌తో పనిచేశారు

కాంగ్రెస్ ప్రభుత్వానికి అది సాధ్యం కావడం లేదు

మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

అల్మాస్‌గూడ రాజీవ్ గృహకల్పలో బస్తీ దవాఖానను ప్రారంభించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్ పేట, ఫిబ్రవరి 8: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధికి ఒక్కపైసా కేటాయించడం లేదని పాలన పూర్తిగా గాడి తప్పిందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప లో కొత్తగా ఏర్పాటు చేసిన బస్తీ దవఖానను, మహిళా భవనాన్ని ఆమె శనివారం నాడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదవారికి నాణ్యమైన వైద్యం అందించడానికి కేసీఆర్ చక్కటి విజన్‌తో అనేక ఆరోగ్య పథకాలు అమలు చేశారని అనేక వైద్య మౌలిక వసతులు ఏర్పాటు చేశారని తెలిపారు. అందులో భాగంగానే మహేశ్వరం నియోజకవర్గంలో 10 బస్తీ దవఖానలు, 8 అర్బన్ దవఖానలు ఏర్పాటయ్యాయని వెల్లడించారు. అంతేకాకుండా నగరంలో 4 సూపర్ స్పెషాలిటీ దవాఖానలను ఏర్పాటు చేయడానికి మాజీ సీఎం కేసీఆర్ 1200 కోట్ల రూపాయల చొప్పున కేటాయించినట్టు ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. సమూలమైన మార్పులు చేయడానికి కెసీఆర్ ఎంతో కృషి చేశారని ఆమె గుర్తు చేశారు. బడంగ్‌పేటలో త్వరలోనే 50 పడకల ఆసుపత్రి నిర్మాణం చేయించడానికి కృషి చేస్తానని ఆమె తెలిపారు.

శంకుస్థాపనలు సరే..

మరి నిధులేవీ?

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహేశ్వరం నియోజకవర్గానికి మంత్రులందరూ వచ్చి పోతున్నారు తప్ప ఒక్క పైసా ఇవ్వలేదని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. శంకుస్థాపనలు చేసి పోతున్నారే తప్ప నిధులు మాత్రం ఇవ్వడం లేదని తెలిపారు. అభివృద్ధికి సహకరించకుండా ఆరోపణలకే పరిమితమవుపోతున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. పాలన అంతా గాడి తప్పిపోయిందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలలో సిబ్బందికి కనీసం వేతనాలు ఇవ్వలేకపోతున్నారని ఆమె ఆరోపించారు. గతంలో సర్పంచులు చేసిన పనులకు పెండింగ్ బిల్లులు ఇవ్వడం లేదని అన్నారు.

మేం నిధులిస్తే..కాంగ్రెస్ రద్దు చేసింది

చెరువులను అభివృద్ధి చేయడానికి కేసీఆర్ ప్రభుత్వం కృషి చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఆ అభివృద్ధిని అడ్డుకుంటున్నదని ఆమె ధ్వజమెత్తారు. అల్మాస్‌గూడలో ఉన్న చెరువుల అభివృద్ధికి 2 కోట్లు బీఆర్ ఎప్ ప్రభుత్వం కేటాయిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటిని రద్దు చేయించిందని ఆమె మండిపడ్డారు. చెరువును అభివృద్ధి చేస్తే స్థానికంగా ఉన్న ప్రజలకు మేలు జరుగుతుందన్న ఉద్దేశంతో చెరువులను సుందరీ కరణ చేశామని తెలిపారు. కొంతమేరకు పనులైన తర్వాత మధ్యంతరంగా పనులు నిలిపివేయడం ఎంత వరకు సమంజసం అని సబిత ప్రశ్నించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వమని కేంద్ర ప్రభుత్వం చెప్పితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్క మాట కూడా మాట్లాడడం లేదని విమర్శించారు. నియోజకవర్గానికి సంబంధించిన ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించకపోతే కేంద్రాన్ని ఎందుకు అడగడం లేదో సీఎం సమాధానం చెప్పాలన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ గీత, డాక్టర్ బాలమణి, డి ఈ జ్యోతి, మాజీ ప్రజా ప్రతినిధులు ముత్యాల లలిత కృష్ణ, ఏనుగు రాంరెడ్డి, యాతం పవన్, అర్జున్, సంరెడ్డి వెంకట్ రెడ్డి, రామిడి రామ్ రెడ్డి, బోయపల్లి శేఖర్ రెడ్డి, జంగారెడ్డి, స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

బాబోయ్... వరుస దొంగతనాలు

- తాండూరులో రెండిండ్లల్లో 57 తులాల బంగారం అపహరణ
- ఆందోళన చెందుతున్న స్థానికులు

సాయిపూర్‌లో దొంగతనంకు గురైన ఇంటిని పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐ

తాండూరు, ఫిబ్రవరి 8 : తాండూరు నియోజకవర్గంలో జరుగుతున్న వరుస దొంగతనాలు స్థానికులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. చాలావరకు తాండూరు పట్టణంలో పట్టపగలు తాళం వేసి ఉన్న వాటినే లక్ష్యంగా చేసుకొని దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. తాండూరు నియోజకవర్గంలో గత కొన్ని రోజులుగా ఆలయాలు, దుకాణాలు, ఇండ్లు అనే తేడా లేకుండా అన్ని చోట్లా చోరీలు జరుగుతుండడం ప్రజలను కలవర పెడుతున్నది. సీసీ కెమెరాలున్నాయన్న భయం లేదు.. పోలీసులు పట్టుకుంటారన్నా బెదురు లేదు. దొంగలు యథేచ్ఛగా తమ పని తాము చేసుకుపోతున్నారు. అందినకాడికి నగదు, బంగారం, విలువైన వస్తువులు ఎత్తుకెళ్తున్నారు. శనివారం తాండూరు మున్సిపల్ పరిధిలోని సాయిపూర్‌లో పి.వెంకటేశ్ సరళ దంపతుల ఇంట్లో 40 తులాల బంగారం ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. వీరు ఈ నెల 6న కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి బంధువుల దగ్గరకు వెళ్లారు. వచ్చి చూసే సరికి ఇంట్లో సామగ్రి చిందరవందరగా ఉండడంతో అనుమానం వచ్చిన వెంకటేశ్ ఇంట్లో అంతా పరిశీలించగా 40 తులాల బంగారం పోయినట్లు గుర్తించాడు. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, సీఐ సంతోశ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా చేపట్టారు. క్లూస్ టీంను రంగంలోకి దింపి దొంగలను పట్టుకునే ప్రయత్నం చేపట్టారు.

దొంగతనం కవరేజీకి వెళ్లిన రిపోర్టర్ ఇంటికే కన్నం...

సాయిపూర్‌లో జరిగిన దొంగతనం కవరేజీకి వెళ్లిన ఓ పత్రికలో పనిచేస్తున్న బస్వరాజ్ గౌడ్ ఇంటికే దొంగలు కన్నం వేశారు. పాత తాండూరులో ఉంటున్న బస్వరాజ్ న్యూస్ కోసం ఇంటికి తాళం వేసి బయటకు వచ్చాడు. భార్య అంగన్‌వాడీ టీచర్‌గా పని చేస్తుండడంతో స్కూల్‌కు వెళ్లింది. ఇదే అదునుగా భావించిన దొంగలు పాత్రికేయుడి ఇంట్లోకి చొరబడి 17 తులాల బంగారం, రూ.5 లక్షలను దోచుకెళ్లారు. ఇంటికి వచ్చి లాబోదిబోమంటూ పోలీసులకు సమాచారం ఇచ్చారు. డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, సీఐ సంతోశ్‌కుమార్, ఎస్సై రమేశ్ ఘటనా స్థలానికి చేరుకొని క్లూస్ టీంలను రప్పించి ఆధారాలను సేకరించారు.

ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన

ఇప్పాయిపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులు నిర్వహిస్తున్న మాక్‌పోలింగ్‌ను పరిశీలిస్తున్న ఎంఈవో అబీబ్ హైమద్

కులకచర్ల, ఫిబ్రవరి 8 : పాఠశాలల్లో మాక్‌పోలింగ్ నిర్వహించడంతో విద్యార్థులకు ఓటు హక్కు, ఎన్నికల నిర్వహణపై అవగాహన కలుగుతుందని కులకచర్ల మండల విద్యాధికారి అబీబ్‌హైమద్ అన్నారు. శనివారం మండల పరిధిలోని ఇప్పాయిపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాక్‌పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణలో ఓటు వేయడం, లెక్కింపు, అభ్యర్థుల ప్రకటన వరకు మాడల్‌గా ఉపాధ్యాయులు చూయించారు. రానున్న రోజుల్లో విద్యార్థులకు మాక్ పోలింగ్‌పై సూచనలు, తద్వారా రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కు చాలా ముఖ్యమైనదని విద్యార్థులు పొందిన అనుభవాన్ని వారి తల్లిదండ్రులకు తెలియజేస్తారన్నారు. ఇప్పాయిపల్లి ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులు 10/10 సాధించాలని సూచించారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో మాక్‌పోలింగ్ నిర్వహించడంపై అభినందించారు. కార్యక్రమంలో ఎంఎన్‌వో జైపాల్‌రెడ్డి, సాంఘిక శాస్త్రం ఫోరం మండల అధ్యక్షుడు వెంకటయ్య, కుస్మసముద్రం పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనిల్‌కుమార్, స్థానిక హెచ్ఎం పాండురంగయ్య, ఉపాధ్యాయులు సరిత, రుక్మిణి, శివశంకర్, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రైవేట్ వీడియోలతో బెదిరింపులు

డబ్బులు గుంజిన వ్యక్తితో పాటు కుటుంబ సభ్యులపై కేసు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 8: ప్రేమ పేరుతో నమ్మించి శారీరకంగా లోబర్చుకోవడంతోపాటు ఆమెకు సంబంధించిన ప్రైవేటు వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానంటూ కుటుంబ సభ్యులతో కలిసి బెదిరిస్తూ బంగారం లాక్కుని వెళ్లిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్న ఓ వివాహిత(36) భర్తతో గొడవపడి తన ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటుంది. కువైట్లో నివాసం ఉంటూ ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైన కుడుపూడి ప్రసాదరావు కొన్నాళ్లపాటు చాటింగ్‌తో వివాహితకు దగ్గరయ్యాడు. 2020 నుంచి ఇండియా వచ్చినప్పుడల్లా ఆమెను కలుస్తూ ప్రేమిస్తున్నానని నమ్మబలికాడు. వచ్చినప్పుడల్లా ఖరీదైన బహుమతులు తీసుకువచ్చి ఆమెను లోబర్చుకున్నాడు. ఈ క్రమంలో వారిద్దరు సన్నిహితంగా ఉన్న ఫొటోలు, వీడియోలను తీసుకొని తన వద్ద ఉంచుకున్నాడు. కువైట్ లో ఉన్నప్పుడు వీడియో కాల్ ద్వారా కూడా కొన్ని ప్రైవేటు వీడియోలను తీసుకుని పెట్టుకున్నాడు. ఇదిలా ఉండగా.. ఇటీవల అతడి ప్రవర్తనలో మార్పు రావడంతో తన వద్దకు రావద్దని ఆమె తేల్చి చెప్పింది. దాంతో తాను ఇచ్చిన బహుమతులు, పెట్టిన ఖర్చు తిరిగి ఇవ్వాలంటూ వేధింపులకు పాల్పడటం మొదలుపెట్టాడు. తనకు రావాల్సిన డబ్బులు ఇవ్వకపోతే నీ ప్రైవేట్ వీడియోలను సోషల్ మీడియాలో పెడుతా అంటూ బెదిరించాడు. రెండు రోజుల కిందట వారిద్దరి ఫొటో ఫేస్ బుక్ లో షేర్ చేశాడు. అంతటితో ఆగకుండా తన భార్య భవాని, తండ్రి రామకృష్ణ తోపాటు మరి కొంతమందిని వివాహిత ఇంటికి పంపించి దౌర్జన్యం చేయించాడు. ప్రసాద్ రావు వద్ద నుంచి రూ. 4,28,800 అప్పు తీసుకున్నట్లు ఆమె చేత బలవంతంగా పత్రాలపై సంతకం చేయించుకోవడంతో పాటు 28 గ్రాముల బంగారాన్ని లాక్కున్నారు. "నా భర్తకు గాలం వేసి డబ్బులు దండుకున్నావు.'' బంగారం తీసుకున్నావ్..'' అంటూ తీవ్ర అభ్యంతరమైన భాషతో దూషించారు. నీ బతుకు బట్టబయలు చేస్తామంటూ బెదిరింపులకు గురి చేశారు. దీంతో బాధితురాలు శనివారం జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. నిందితులు ప్రసాద రావు, భవాని, రామకృష్ణ తదితరులపై బీఎన్ ఎస్ సెక్షన్ 77,78(1),308(2) తో పాటు ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పైప్‌లైన్ లీకేజీతో నీటి వృథా

పైప్‌లైన్ లీకేజీతో రోడ్డుపై పారుతున్న నీరు

పరిగి, ఫిబ్రవరి 8 : పరిగి మున్సిపాలిటీ పరిధిలోని మూడో వార్డులో తాగునీటి సరఫరాపై అధికారుల తీరు పట్ల ప్రజలు మండిపడుతున్నారు. సాయిరాంకాలనీలో తాగునీటి సరఫరా పైప్‌లైన్ లీకేజీ అవుతున్నదని పలుమార్లు సమాచారం ఇచ్చినా మరమ్మతు చేయించేవారు కరువయ్యారని వాపోతున్నారు. పది రోజుల క్రితమే నీటి పైప్‌లైన్ లీకేజీని సరిచేయగా మరోసారి లీకేజీ అవుతుందని చెప్పారు. చిన్నపాటి లీకేజీకే ఓపిక పట్టలేరా? అంటూ మున్సిపల్ అధికారులు ఎదురు ప్రశ్నిస్తున్నారని పేర్కొన్నారు. మంచినీటి పైప్‌లైన్ లీకేజీతో నీరంతా రోడ్డుపై వృథాగా పారుతున్నది. లీకేజీతో నీరు కలుషితమైతే ఎవరు బాధ్యులని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

భూసర్వేను అడ్డుకుంటారని.. బైండోవర్

పోలీసుల అదుపులో విశాల్

కులకచర్ల, ఫిబ్రవరి 8 : హకీంపేట్ రెవెన్యూ పరిధిలోని భూసర్వేను నిర్వహిస్తున్న అధికారులను ఇబ్బందులకు గురి చేస్తారని భావించిన పోలీసులు శనివారం దుద్యాల్ మండల పరిధిలోని పోలేపల్లి గ్రామానికి చెందిన విశాల్‌ను కులకచర్ల పోలీస్టేషన్‌కు తరలించి బైండోవర్ చేశారు. విశాల్‌పై లగచర్ల ఘటనలో కేసు నమోదు కావడంతో బైండోవర్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

మైనర్‌పై లైంగికదాడి ..నిందితుడి రిమాండ్

మంచాల, ఫిబ్రవరి 8 : మైనర్ బాలికపై లైంగికదాడి చేసిన నిందుతుడిని శనివారం సాయంత్రం రిమాండ్‌కు తరలించినట్లు ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు, మంచాల సీఐ మధు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని కాగజ్‌ఘట్ గ్రామ సమీపంలో ఉన్న సిరి రిసార్ట్‌లో ఈ నెల 4న శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన విద్యార్థులు విహారయాత్రకు వెళ్లారు. అదే స్కూల్‌కు చెందిన వ్యాన్ డ్రైవర్ జోసఫ్‌రెడ్డి ఒకటో తరగతి చదువుతున్న మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు తల్లిదండ్రుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు చెప్పారు.

నేటి జీవనశైలితో క్యాన్సర్ ఎవరికైనా రావచ్చు

బంజారా హిల్స్లోని బసవతారకం ఆధ్వర్యంలో అవగాహన వాక్ ప్రారంభిస్తున్న నగర పోలీస్ కమిషనర్ సి వి ఆనంద్

వాక్ ను ప్రారంభించిన నగర సీపీ సీవీ.ఆనంద్

బంజారాహిల్స్ ఫిబ్రవరి 8: రోజురోజుకు మారుతున్న జీవనశైలి, రకరకాల కాలుష్యాలు తదితర కారణాలతో క్యాన్సర్ మహమ్మారి ఎవరికైనా సోకే అవకాశం ఉంటుందని, ప్రతిక్షణం అప్రమత్తంగా ఉంటూ క్యాన్సర్ నుంచి తప్పించుకోవాలని నగర పోలీస్ కమిషనర్ సీవీ.ఆనంద్ అన్నారు. బంజారాహిల్స్ లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమంలో భాగంగా శనివారం క్యాన్సర్ అవేర్నెస్ వాక్ ఏర్పాటు చేశారు. ఈ వాక్ ను జెండా ఊపి ప్రారంభించిన నగర సీపీసి వి ఆనంద్ మాట్లాడుతూ.. 25 ఏండ్ల కిందట తాను డీసీపీగా పనిచేస్తున్న సమయంలో బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ప్రారంభమైందని, నాటి నుంచి నేటి వరకు లక్షలాది మంది రోగులకు క్యాన్సర్ చికిత్స అందిస్తున్నారన్నారు. గతంలో క్యాన్సర్ అంటే మరణం అనుకునేవారని, పెరుగుతున్న పరిశోధనలు, టెక్నాలజీ కారణంగా ప్రస్తుతం క్యాన్సర్ వ్యాధికి అత్యాధునిక చికిత్సలు అందుబాటులోకి వచ్చాయన్నారు. శాస్త్రవేత్తలు, వైద్యుల కృషితో అనేకమంది క్యాన్సర్ నుంచి బయటపడి క్యాన్సర్ విజేతలుగా ఇతర రోగులలో స్ఫూర్తి నింపుతున్నారన్నారు. ఆహార అలవాట్లు, వివిధ రకాలైన కాలుష్య కారణాల వల్ల ప్రతి ఒక్కరిపై క్యాన్సర్ ముప్పు పొంచి ఉందని, నిరంతరం అప్రమత్తంగా ఉండటమే ముఖ్యమన్నారు. క్యాన్సర్ సోకిన వారికి సరైన సమయంలో గుర్తించి చికిత్స అందించాల్సిన బాధ్యత కుటుంబ సభ్యులదే అన్నారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సీఈవో డాక్టర్ కే కృష్ణయ్య, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఫణి కోటేశ్వరరావు, డాక్టర్ కల్పనా రఘునాథ్‌తోపాటు వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది, నర్సింగ్ కళాశాల విద్యార్థులు, కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి

బంట్వారం, ఫిబ్రవరి 8 : బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందిన ఘటన కోట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం మధ్యాహ్నం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. కోట్‌పల్లి మండల పరిధిలోని జిన్నా రం గ్రామానికి చెందిన పర్మటి బందయ్య (52) బైక్‌పై కోట్‌పల్లి నుంచి జిన్నారం గ్రామానికి వెళ్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృ తుడి భార్య హన్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై గఫార్ తెలిపారు.

మోత్కుపల్లిలో వ్యక్తి ఆత్మహత్య

బంట్వారం/కోట్‌పల్లి, ఫిబ్రవరి 8 : అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మ హత్య చేసుకున్న ఘటన కోట్‌పల్లి పోలీస్ పరిధిలో శనివారం జరిగింది. ఎస్సై గఫార్ తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని మోత్కుపల్లికి చెందిన బైండ్ల లక్ష్మయ్య (67) వారం రోజుల నుంచి అస్తమా వ్యాధితో బాధపడుతున్నాడు. వ్యాధి బాధ ఎక్కువ కావడంతో శుక్రవారం మధ్యాహ్నం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వికారాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి తీవ్రంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా దవాఖానకు తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. మృతుడి కుమారుడు సురేందర్ ఫిర్యాదు మేరకు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గ్యాస్ లీకేజీతో ముగ్గురికి గాయాలు

కులకచర్ల, ఫిబ్రవరి 8 : గ్యాస్ లీకేజీతో ముగ్గురికి గాయాలైన ఘటన కులకచర్ల మండల పరిధిలోని గోరిగడ్డతండాలో శనివారం జరిగింది. గోరిగడ్డతండాకు చెందిన పాండు, గణేశ్, దేవి వంట గదిలో ఉండగా అకస్మాత్తుగా గ్యాస్ లీకేజీ కావడంతో మంటలు పెద్దగా వ్యాపించడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. వారు వెంటనే ఇంట్లో నుంచి బయటకు వచ్చినట్లు తెలిపారు. గమనించిన స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ దవాఖానకు తరలించారు. గ్యాస్ లీకేజీతో ఇళ్లు దగ్ధం అవుతున్న విషయాన్ని గమనించిన గ్రామస్తులు వెంటనే అక్కడే ఉన్న బోరు నీటి ద్వారా మంటలను అదుపు చేశారు.

ఇదేనా.. ప్రజా ప్రభుత్వం

- గ్రామీణ రోడ్లు అధ్వానంగా మారినా పట్టించుకోరా..
- త్వరలోనే బీఆర్ఎస్ గ్రామాల బాట
- పార్టీ నవాబుపేట మండల అధ్యక్షుడు దయాకర్ రెడ్డి

గుబ్బడిఫత్యేపూర్ నుంచి ముభారక్ పూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు

నవాబుపేట, ఫిబ్రవరి 8 : ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా.. గ్రామీణ రోడ్ల పరిస్థితి చూస్తే అర్థమవుతుందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అంతమోళ్ల దయాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని ముభారక్ పూర్, యెల్లకొండ, గుబ్బడీ ఫత్యేపూర్, గంగ్యాడ, గుల్లగూడ, లింగంపల్లి, పులుమామిడి నవాబుపేట గ్రామాల రోడ్ల దుస్థితిపై ఆయన మీడియాతో మాట్లాడారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి సాధిస్తుందన్నారు. అలాంటి గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు. ఇదేనా ప్రజా ప్రభుత్వం.. అని ఆయన ప్రశ్నించారు. గ్రామీణ రోడ్లు అధ్వానంగా మారడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఆ రోడ్లపై వెళ్లేందుకు వాహనదారులు నరకయాతన పడుతున్నారని తెలిపారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించలేకున్నా ప్రజా ప్రభుత్వమని గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. త్వరలోనే బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలతో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుతామన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే కొన్ని గ్రామాలకు నిధులు మంజూరు కావడంతో టెండర్లను కూడా పిలిచారని తెలిపారు. వాటిని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని తెలిపారు. ఎందుకు ఇలా చేస్తున్నదో కనీసం వారికైనా అర్థమవుతున్నదో లేదో సూటిగా చెప్పాలన్నారు. మండల పరిధిలోని గ్రామాల రోడ్ల దుస్థితి ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడు కూడా ప్రజల పక్షానే ఉంటుందన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులకు తగిన గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ నెల 5న నవాబుపేట మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో రైతు సమస్యలపై దీక్ష చేసిన సమయంలో జరిగిన ఘటనలను వివరించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తెలియజేయడానికి త్వరలోనే పోస్ట్ కార్డుల ద్వారా సీఎం కార్యాలయానికి ఉత్తరాలు రాస్తామని, అప్పుడైనా కనీసం స్పందన వస్తుందో చూస్తామన్నారు.

బస్సు డ్రైవర్‌తో పాటు ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి

- ఇన్ఫాంట్ జీసస్ పాఠశాల ఎదుట తల్లిదండ్రుల ఆందోళన
- మంచాల పోలీసులపై నమ్మకంలేదు
- ఆర్‌జీఐఏ పోలీసులకు మరోసారి ఫిర్యాదు

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 8: అభం శుభం తెలియని చిన్నారిపై అసభ్యంగా ప్రవర్తించిన బస్సు డ్రైవర్ జోసస్‌రెడ్డి తో పాటు పాఠశాల ప్రిన్సిపాల్ ఆనంద్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం శంషాబాద్ పట్టణంలోని ఇన్ఫాంట్ జీసస్ పాఠశాల ఎదుట తల్లిదండ్రులతో పాటు శంషాబాద్ పట్టణంలోని వివిధ పార్టీల నాయకులు, విద్యార్థి సంఘాలు నాయకులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొదటి తరగతి చదువుతున్న విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన బస్సు డ్రైవర్ జోసప్‌రెడ్డితో పాటు పాఠశాల ప్రిన్సిపాల్ ఆనంద్, బస్సు డ్రైవర్ భార్యను విధుల నుంచి తొలగించి చిన్నారి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మంచాల పోలీసులు సరైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేయలేదని, వారిపై తమకు నమ్మకంలేదని ఆరోపించారు. విషయం తెలుసుకున్న శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ సీఐ బాలరాజు ఆధ్వర్యంలో పలువురు పోలీసులు అక్కడికి చేరుకొని ఆందోళన చేస్తున్న వారిని సముదాయించారు. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మొదటి తరగతి చదువుతున్న చిన్నారిపై ఇలాంటి చర్య జరిగితే మిగితా పిల్లల పరిస్థితి ఏమిటని నిలదీశారు. మరోసారి ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా హామీ ఇవ్వాలని కోరారు. అనంతనం పాఠశాల నుంచి ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీగా వచ్చి సీఐ బాలరాజుకు మరోసారి ఫిర్యాదు చేశారు. ఆందోళన నిర్వహించిన వారిలో శంషాబాద్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బండిగోపాల్, నాయకులు కొన్నమొల్ల శ్రీనివాస్, పలువురు తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటాం..: బాలరాజు, ఆర్‌జీఐఏ సీఐ

నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటాం. మంచాల పోలీస్‌స్టేషన్ పరిధిలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. శంషాబాద్ పట్టణంలో జరిగిన ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తాం. శంషాబాద్‌లోని ప్రైవేటు పాఠశాలలో యాజమాన్యం ప్రతి రోజు బస్సు డ్రైవర్లపై డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేయడంతో పాటు ఏదైనా ఘటన జరిగితే ఆయా పాఠశాలల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

PUBLIC NOTICE

Date: 08-02-2025

The General public are hereby informed that my client Md Ansar Ali, S/o. Md Sadath Ali, R/o. H.No. 4-1-308, Alampally Road, Vikarabad Municipality and District has entered into an agreement of Sale with Mohammed Azhar, S/o. Mohammed Akthar @ MD Akthar, R/o. H.No. 2-159, Youth Colony, Old Hafeezpet, Miyapur, Hyderabad, in respect of purchase of a Open Plot of land admeasuring 666.56 Sq.Yards or 557.31 Sq.Meters, situated at Ward No. 2, Block No. 3, Near H.No. 2-3-25, Shivareddypet Village, Vikarabad Mandal, Municipality, Vikarabad District and my client paid substantial sale consideration to the vendor . If any person or persons have any right, interest, claim or objection over the above mentioned property including creditors, banks, financial institutions may approach the undersigned Advocate within (7) days along with all original documents failing which after seven days of this public notice objections shall not be entertained and my client may complete the sale transaction of registered sale deed. Hence this Public Notice.

Sd/- MOHAMMED IRFAN, Advocate
R/o. H.No. 4-1-505/5, Venkatashwara Colony, Vikarabad Municipality & Dist.,
Cell: 8019562022, 6305402206.